



RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ బుధవారం 16-04-2025 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 07 సంచిక : 69 పేజీలు : 4 వెల : రూ 2-00


## ఢిల్లీలో గాలి పీల్చుకుంటే మూడు రోజుల్లోనే అనారోగ్యం ఖాయం : నితిన్ గడ్కరీ

ఢిల్లీ.. దేశ రాజధాని.. కానీ ఇప్పుడు కాలుష్య కాసారంగా మారింది. ఇక్కడి గాలి పీల్చుకోవాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్వయంగా ఆందోళన వ్యక్తం చేశారు. "ఢిల్లీలో మూడు రోజులు ఉంటే అనారోగ్యం పాలవడం ఖాయం" అని ఆయన చేసిన వ్యాఖ్యలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి. ముంబై, ఢిల్లీ నగరాలు రెడ్ జోన్‌లో ఉన్నాయని హెచ్చరించిన ఆయన, వైద్య పరిశోధనలను ఉటంకిస్తూ ఢిల్లీలో ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల ఆయుష్షు 10 సంవత్సరాలు తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణం, అభివృద్ధి.. రెండూ ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయని గడ్కరీ నొక్కి చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధికి ఎంత ప్రాధాన్యతనిస్తామో, పర్యావరణానికి కూడా అంతే ప్రాధాన్యతనివ్వాలని పిలుపునిచ్చారు.

# దేశ ప్రజలకు కేంద్రం గుడ్‌న్యూస్



న్యూఢిల్లీ: దేశ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఆస్పత్రుల్లో మెడిక్లెయిమ్ ప్రక్రియ వేగవంతం చేయడంపై చర్యలు చేపట్టింది. ఆరోగ్య బీమా క్లెయిమ్ ఆథరైజేషన్‌ను 1 గంటలో.. తుది సెటిల్మెంట్‌ను 3 రోజుల్లో పూర్తి చేయడం తప్పనిసరి చేయాలని కేంద్రం భావిస్తోంది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమాణాలతో బీమా క్లెయిమ్, అప్లికేషన్ ఫారమ్‌లను సులభంగా అర్థం అయ్యేలా రూపొందించనుంది. ప్రతి భారత పౌరుడికి 2047 నాటికి ఆరోగ్య బీమా కల్పించాలనే లక్ష్యంతో కేంద్రం చర్యలు తీసుకుంటోంది. మెడిక్లెయిమ్ ప్రాసెసింగ్‌ను డిజిటల్‌గా ప్రమాణీకరించేందుకు నేషనల్ హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజ్ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చెయ్యాలని నిర్ణయించింది. 2024 జులై నాటికి 34 బీమా సంస్థలు.. 300 ఆసుపత్రులు నేషనల్ హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజ్‌లో చేరాయి. మొత్తం 2 లక్షల ఆసుపత్రులను నేషనల్ హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజ్‌లో భాగం చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. క్లెయిమ్ ప్రాసెసింగ్ వేగవంతం అయితే ప్రజల్లో ఆరోగ్య బీమాపై నమ్మకం పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. కొన్ని సందర్భాల్లో బీమా కంపెనీలు క్లెయిమ్‌లను పూర్తిగా తిరస్కరిస్తున్నాయి. దీనిపై నియంత్రణ అవసరం అని కేంద్రం భావిస్తోంది. ఇక, క్లెయిమ్ తిరస్కరణలను తగ్గించేందుకు బీమా నియంత్రణ సంస్థ 2024లో కొత్త నియమాలు విడుదల చేసింది.

# తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..



### ఇక నుంచి రూ. 4 లక్షలు..

హైదరాబాద్, ఏప్రిల్ 15, రాష్ట్రంలో ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. రానున్న రోజులలో మరింత ఎండల తీవ్రత ఉంటుందని భారత వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని ఎఓఆ చేసిన సూచనలతో రేవంత్ సర్కార్ అప్రమత్తమైంది. వడగాల్పులను విపత్తుగా ప్రకటించిన ప్రభుత్వం ముందస్తు చర్యలకు రంగంలోకి దిగింది. ఈ క్రమంలోనే హీట్ వేవ్, సన్ స్ట్రోక్ లను రాష్ట్ర నిర్దిష్ట విపత్తులుగా ప్రకటిస్తూ మంగళవారం ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులను జారీ చేసింది. కీలకనిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం తీవ్ర ఎండల వల్ల వచ్చే వడగాల్పులను రాష్ట్ర నిర్దిష్ట విపత్తుగా ప్రకటించాలని భావించింది. ఇకనుంచి వడదెబ్బ బారిన పడే బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని వారికి ఉపశమనం కల్పించే ఉద్దేశంతో ఎక్స్‌గ్రేషియాను పెంపు చేసింది. ఆపద్బంధు పథకం క్రింద నాలుగు లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా పునరావాస సహాయ నిబంధనల ప్రకారం ఎక్స్‌గ్రేషియా అందించాలని నిర్ణయించిన తెలంగాణ ప్రభుత్వం వారికి అందించే ఆర్థిక సహాయాన్ని భారీగా పెంచింది. ఇప్పటివరకు ఆపద్బంధు పథకం కింద బాధిత కుటుంబాలకు 50 వేల రూపాయల ఎక్స్‌గ్రేషియా అందించేవారు. అయితే తాజా ప్రకటన ప్రకారం వడదెబ్బతో మరణించిన ప్రతి వ్యక్తి కుటుంబానికి విపత్తు ప్రతిస్పందన నిధి నుండి ఆపద్బంధు పథకం కింద నాలుగు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని నిర్ణయించింది. బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కోసం నిర్ణయం ఒక్కసారిగా 50 వేల నుంచి నాలుగు లక్షల రూపాయలకు ఈ పరిహారం పెంపుదల చేయడంతో బాధిత కుటుంబాలకు కొంతైనా భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తుంది. వడదెబ్బ కారణంగా ప్రాణాలను కోల్పోయిన వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన ప్రభుత్వం ఇక ఇదే సమయంలో ఈ సంవత్సరం వడగాల్పులు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తీవ్రంగా ఎండలు ఉన్నాయని, తీవ్రంగా వడగాలులు వీచే సమయంలో, ఎండలు ఉన్న సమయంలో బయటకు రావద్దని పేర్కొంది. తీవ్రమైన ఎండల నేపథ్యంలో వాతావరణ శాఖ సూచనలను, వైద్య ఆరోగ్య శాఖ సూచించే జాగ్రత్తలను పాటించాలని పేర్కొంది.

# అంబేద్కర్, రాజీవ్ ల మూలంగా మహిళలకు విశిష్ట అధికారాలు




హైదరాబాద్,ఏప్రిల్15:ఈ దేశంలో మహిళలకు విశిష్ట అధికారాలు,హక్కులు, రాజకీయాల్లో వాటాకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ లే పునాదులు వేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం హైదరాబాద్ తాజ్ డెక్కన్ లో జరిగిన స్త్రీ సమ్మిట్ లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మనదేశంలోబాల్యవివాహాలు, వరకట్నం నిషేధం, మహిళలకు ఓటు

### గ్రీన్ పవర్ ఉత్పత్తిలో మహిళలకు భాగస్వామ్యం

### మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం స్త్రీ సమ్మిట్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హక్కు, విడాకులు, మహిళలకు ఆస్తిలో వాటా వంటి చట్టాలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ హిందూ కోడ్ బిల్ ద్వారానే ఆచరణలోకి వచ్చాయని వివరించారు. స్థానిక సంస్థల్లో 33% మహిళలకు రిజర్వేషన్ను మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. ఈ చర్యల మూలంగా మహిళలు ఎన్నికలు, పరిపాలన రంగంలోకి ప్రవేశించారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి సంవత్సరం లక్ష్యానికి మించి 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేశామని తెలిపారు. రాబోయే నాలుగు సంవత్సరాలు ప్రతి ఏటా 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళలకు అందజేస్తామని తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన గ్రీన్ పవర్ పాలసీలో మహిళలకు భాగస్వామ్యం కల్పించినట్టు తెలిపారు. సోలార్ ఉత్పత్తి రంగాల్లోకి వారిని తీసుకు వస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యుత్ శాఖ, ప్రభుత్వంలోని ఇతర శాఖలు కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలతో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతం అయితే పెద్ద ఎత్తున వారితో సోలార్ ఉత్పత్తి చేయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. బ్యాంకు లింకేజీ ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయించి, ఖాళీ స్థలాలు ప్రభుత్వమే లీజుకు ఇచ్చి, మహిళా సంఘాలు ఉత్పత్తి చేసిన విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఒప్పందం కూర్చున్నామని వివరించారు. మహిళలు ఆర్థికంగా ప్రయోజనం పొందేందుకు ఆర్టీసీ బస్సులో రాష్ట్రంలో ఎక్కడైనా ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించినట్టు వివరించారు. ఈ సౌకర్యం ద్వారా మహిళలు హాస్టల్లోనే పిల్లలను చూసేందుకు, మార్కెట్లు, దేవాలయాలను స్వేచ్ఛగా సందర్శించేందుకు అవకాశం ఏర్పడిందని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్రంలో విజయవంతం అయిందని వివరించారు. బ్యాంకు రుణాల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలతో బస్సులు కొనుగోలు చేయించి వాటిని ఆర్టీసీకి లీజుకు ఇచ్చి ఆర్థికంగా ప్రయోజనం పొందే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. వీటితోపాటు రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలు అన్నిటిలో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇందిరాశక్తి క్యాంటీన్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇచ్చాము దీని ద్వారా వారు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉందన్నారు. ఆధునిక యుగంలోనూ నేటికీ బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు కొనసాగుతున్నాయి ఈ అంశంపై సమాజం మొత్తం ఆలోచన చేయాలని డిప్యూటీ సీఎం కోరారు. స్త్రీ సమ్మిట్ వంటి కార్యక్రమాలు ప్రజలను సన్మార్గంలో నడపడానికి ప్రభుత్వాలు సరైన చట్టాలు తెచ్చేందుకు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.

# రాష్ట్రంలో కులగణన ప్రామాణికం

హైదరాబాద్,ఏప్రిల్15: కులగణన.ప్రామాణికం ఇది దేశానికే ఆదర్శాని నోవాటెల్ లో సిఎల్పీ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా కుల గణన దాని తరువాత జరిగిన ప్రక్రియ సబ్ కమిటీ,బీసీ డెడికేటెడ్ కమిషన్ కేబినెట్ అప్రూవల్ సభలో యాక్ట్ 2,3 ద్వారా బీసీ లకు 42 శాతం స్థానిక సంస్థలు,విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసి గవర్నర్ దగ్గరకు వెళ్లిందని తెలిపారు. ఈనెల ఏప్రిల్ 8 న ఆమోదం పొందింది. గవర్నర్ కు ధన్యవాదాలు తెలిపారు. బీసీ ల రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి దగ్గరకు వెళ్ళిందిఇటీవల సుప్రీంకోర్టు కూడా రెండు నెలల్లో విషయాన్ని తేల్చాలని చెప్పిందితప్పకుండా సానుకూలంగా తీర్పు వస్తుందిశాసన సభలో బీసీ ల



రిజర్వేషన్ల పై అన్ని రాజకీ య పార్టీలు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయికుల గణన సర్వే ప్రామాణికంగా సమాచారాన్ని లక్ష మంది ఉద్యోగుల ద్వారా చేయడం జరిగింది. న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా సమాచార సేకరణ జరిగింది తెలంగాణ లోని 119 నియోజకవర్గాల్లో బీసీ ల నాయకులు ,కుల సంఘాల నాయకులు ,ఉద్యోగ సంఘాల నాయకులు ,బీసీ మేధావులను పిలిచి చారిత్రాత్మక ప్రక్రియ 1931 స్వాతంత్ర్య ఉద్యమ తరువాత జరిగిన కుల సర్వే మళ్ళీ ఇప్పుడు మాత్రమే జరిగిందని ప్రజలకు అవగాహన కల్పించాలి ఈ అంశాన్ని సానుకూలంగా పార్టీ పరంగా ప్రజలంతా మనవైపు చూసేలా కార్యక్రమాలు నిర్వహించాలని శాసన సభ్యులు ,మండలి సభ్యులు , పార్లమెంట్ సభ్యులకు కోరడం జరిగిందిదేశంలోనే బీసీ ల రిజర్వేషన్లు ,ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది రాహుల్ గాంధీ దీనిని ప్రశంసించారు. ఈ అంశాన్ని తీసుకొని ప్రజల్లో పెద్ద ఎత్తున పార్టీ నేతలు కార్యక్రమాలు నిర్వహించాలి అని అన్నారు.

# తెలంగాణలో మరో మూడురోజులు వానలే..

### హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

హైదరాబాద్: తెలంగాణలో రాబోయే మూడురోజులు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. దక్షిణ మధ్యప్రదేశ్ మధ్య నుంచి ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశాల మీదుగా దక్షిణ గ్యాంజెటెక్ పశ్చిమ బెంగాల్ వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని. సగటున సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. అలాగే, దక్షిణ మధ్యప్రదేశ్‌లో ఉన్న ఉపరితల ఆవర్తం విదర్భ, మరాత్వాడ, ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక, దక్షిణ ఇంటీరియర్ కర్నాటక వరకు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. దిగువ ట్రోపో ఆవరణంలో ఆంధ్రప్రదేశ్, యానంలో ఈశాన్య, ఆగ్నేయ గాలులు వీస్తున్నాయని తెలిపింది. నైరుతి బంగాళాఖాతాన్ని ఆనుకొని తమిళనాడు మీదుగా ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిందని చెప్పింది. ఈ క్రమంలో రాష్ట్రంలో మూడునాలుగు రోజులు వానలు కొనసాగే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. బుధవారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వానలు పడుతాయని చెప్పింది. 17న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాలు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడుతాయని హెచ్చరించింది.

# రేవంత్ సర్కార్‌పై కేంద్ర మంత్రి సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్: తెలంగాణలో భూముల అమ్మకాల ద్వారా పరిపాలన చేయాలని చూస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మద్యం, భూములు అమ్మడం ద్వారా నిధులు రాబట్టి పరిపాలన చేయాలని రేవంత్ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ఇంట్లో ఉన్న చెట్టు కొట్టాలన్న జీహెచ్‌ఎంసీలో పర్మిషన్ తీసుకోవాలని.. అలాంటి హెచ్‌సీయూలో చెట్లను ఎలా కొట్టారని ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వం కన్జర్వేషన్ యాక్ట్‌ను ఉల్లంగించిందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏ రాష్ట్రంలోనూ భూములు అమ్మలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్నిక త్వరలో ఉంటుందని.. ఈ విషయంలో మీడియాకు ఎక్కువ ఆతృ?త ఉందన్నారు. తమకు , తమ పార్టీ కార్యక్రమాలు అన్ని సమగ్రంగానే జరుగుతున్నాయని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏఐడీఎంకేతో గతంలో బీజేపీకి పొత్తు ఉండేదని.. ఇప్పుడు దాని పునరుద్దరణ జరిగిందని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. అన్నామలైకి జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అవకాశం ఇస్తారని అన్నారు. నియోజకవర్గ పునర్విభజనపై మోదీ ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. తాము ఎందుకు సౌత్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటామని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ రంగాల సంస్థలను తాము బలోపేతం చేస్తున్నామని అన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్, ఎల్‌ఐసీ , బ్యాంకింగ్ రంగాలను లాభాల్లోకి తీసుకువచ్చామని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం కూలిపోతే తమకు ఇప్పటికిప్పుడు ఏం వస్తోందని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పు ఇస్తారని చెప్పారు. గుజరాత్ వ్యాపారులకు ఏం పనిలేదా... వారు ఎందుకు రేవంత్ ప్రభుత్వాన్ని కులుస్తారని ప్రశ్నించారు. బీసీల రిజర్వేషన్ పెంచాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తే బీజేపీ ఏ నిర్ణయం తీసుకోదని అన్నారు. బీజేపీ స్వతంత్ర ఆలోచనా చేస్తుందని.. తాము ఎప్పుడు నిర్ణయం తీసుకోవాలో అప్పుడు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# 2030 నాటికి 200 మి.చ.అ. కమర్షియల్ స్పేస్

### అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యం

### "సిటిజెన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్" ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, 15 ఏప్రిల్ హైదరాబాద్ లో 2030 నాటికి 200 మిలియన్‌చదరపు అడుగుల "గ్రేడ్ ఏ" కమర్షియల్ స్పేస్ ను అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం నానక్ రాంగూడలో యుూఎస్ కు చెందిన సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన "సిటిజెన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్" ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్ "గ్లోబల్ బిజినెస్ హబ్" గా మారిందని... అందుకు అనుగుణంగానే కమర్షియల్ స్పేస్ కు డిమాండ్ పెరిగిందన్నారు. ఢిల్లీ, చెన్నై లాంటి మెట్రో నగరాల్లో కమర్షియల్ స్పేస్ కు డిమాండ్ తగ్గుతుంటే మన దగ్గర




గతేడాది దేశంలోనే అత్యధికంగా 56 శాతం వార్షిక వృద్ధి రేటు నమోదయ్యిందన్నారు. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్ ను వివిధ సంస్థలు లీజుకు తీసుకున్నాయన్నారు.

# సంపాదకీయం

బుధవారం 16-04-2025

## రష్యా బాటలోనే.. ట్రంప్ యుద్ధం !

ఉక్రెయిన్ యుద్ధం ఇంకా ముగియనే లేదు...ట్రంప్ రూపంలో మరో యుద్ధం మొదలయ్యింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడులతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ఇది ఇంకా కొనసాగు తుండగానే గాజాపై ఇజ్రాయిల్ దాడులు కూడా ప్రభావం చూపాయి. ఇలా అంతర్జాతీయంగా జరుగుతున్న దాడుల కారణంగా ప్రపంచ మార్కెట్లు కుదుపునకు గురవుతున్నాయి. తాజాగా ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాగానే మరో రకమైన యుద్ధానికి తెరతీసారు. సుంకాలతో ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థపై దాడి మొదలు పెట్టారు. ఇది తమకూ వర్తిస్తుందని గుర్తించడం లేదు. అందుకే చైనా ధీటుగానే స్పందిస్తోంది. కొన్ని వస్తువులపై అమెరికాకు పోటీగా సుంకాలు విధించడంతో పాటు, మరికొన్న వస్తువులను అమెరికాకు సరఫరా చేయడం ఆపేసింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడితో ఒక్క ఉక్రెయినే కాకుండా రష్యా కూడా కోలుకోలేని విధంగా దెబ్బతింది. అంతేగాకుండా యుద్ధానికి దిగితే విరమించుకోవడం అంత ఈజీ కాదని తెలిసి వచ్చింది. ఈవ్యవహారం సమసిపోక ముందే ఇప్పుడు ట్రంప్ తీరుతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక విధాలుగా ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. అంతకుమించి అమెరికాలో కూడా ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతు న్నారు. రోడ్డెక్కి ధర్నలు చేస్తున్నారు. ట్రంప్ విధానాలను తూర్పారా బడుతున్నారు. అయినా ట్రంప్‌లో ఏ మాత్రం పశ్చాత్తాపం కనిపించడం లేదు. ప్రపంచ దేశాలు అన్నిటినీ ట్రంప్ వచ్చీరాగానే ఆందోళనలో పడేశాడు. అమెరికాలో చదువుకుంటున్న వారిని, అక్కడికి వెళ్లి ఉంటున్న వారిలో సైతం కంటిమీద కునుకు లేకుండా చేశాడు. ప్రపంచ దేశాల ప్రజలు ట్రంప్ చర్యలు చూసి నవ్వుకుంటున్నారు. సకల దేశాలపై విధించిన సుంకాల వివరాలను ట్రంప్ ప్రకటించారు. కొన్ని దేశాల విషయంలో మాత్రం కొంత ఉదారతను చూపారు. నిరుద్యోగం భారీగా పెరగడం, ద్రవ్యోల్బణం కట్టడి చేయడం లక్ష్యంగా సమస్యలను తొలగిం చేందుకు ట్రంప్ సంకల్పించారు. అమెరికా మహా సంపన్న దేశం. మహాశక్తిమంతమైన దేశం. వైజ్ఞానిక, సాంకేతిక నవకల్పనలు అన్నీ ఆ దేశ ప్రతిభా ఫలాలే. ప్రపంచ అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, ప్రయోగ శాలలు, ఉత్కృష్ట కంపెనీలు అమెరికా లోనే ఉన్నాయి. అమెరికా డాలర్ రిజర్వ్ కరెన్సీగా ప్రపంచ దేశాల ఆమోదం పొందింది. అమెరికా గ్రీన్ కార్డ్, అమెరికా పాస్‌పోర్ట్ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మందిని ఆకర్శిస్తోంది. ఉద్యోగం దొరికితే చాలు అక్కడే స్థిరపడి పోవాలనుకునే భారతీయులు ఎందరో. చైనా, ఇండియాతో సహా అనేక దేశాలు తమ విదేశ మారక ద్రవ్య నిల్వలలో అత్యధిక భాగాన్ని అమెరికా బాండ్ల రూపంలో భద్రపరచుకుంటున్నాయి. ప్రపంచంలో ద్రవ్యలోటు లేని ఏకైక దేశం అమెరికాయే గనుక ఆ దేశ బాండ్లు తమకు ఆర్థిక భద్రత సమకూరుస్తాయని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. దురదృష్ట వశాత్తు తమకు ఎలాంటి లబ్ధిని సమకూర్చడం లేదని ట్రంప్‌ను గెలిపించిన అమెరికా ప్రజలు భావిస్తున్నారు. ఆయన ఏ ఉద్దేశ్యంతో ఈ సుంకాల యుద్ధం మొదలు పెట్టారో కానీ...అమెరికా అధ్యక్షుడుగా రెండోసారి గెలిచిన తరువాత డోనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు, చర్యలు సంచలనం కలిగిస్తున్నాయి. వాటి పర్యవసానాలు సుదీర్ఘకాలం ప్రపంచాన్ని, ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయనున్నాయి. దేశదేశాల నుంచి ప్రతిభావంతుల వలసలు అమెరికాకు నిలిచిపోతాయన్న ఆందోళనలను ట్రంప్ పట్టించుకోవడం లేదు. సరుకుల వాణిజ్యానికి గణనీయమైన విఘాతం కలుగుతుంది. సరఫరా చైన్ ఒడిదుడుకులు ఎదుర్కొంటుంది. ట్రంప్ విధానాల పర్యవసానాలను ఎదుర్కోవడంలో చాలా సంపన్న దేశాలు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. ట్రంప్ ఏవో భ్రమలతో దబాయిస్తున్నారని అందరికీ అర్థమవుతుంది. అమెరికాలోకి దిగుమతి అవుతున్న సరుకులపై భారీ సుంకాలతో సంభవించే ధరల పెరుగుదలను అమెరికా ప్రజలు భరించలేరు. ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతుంది. లక్షలాది ప్రజలు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదమున్నది. ట్రంప్ చర్యల కారణంగా అక్కడ ప్రస్తుతం నిత్యావసర వస్తువులు ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితులను అమెరికా ప్రజలు సహించరు. అమెరికా ఫస్ట్ నినాదాన్ని స్వాగతిస్తూనే ట్రంప్ తీరును ఎండగడుతున్నారు. అమెరికన్లు కూడా ద్రవ్యోల్బణం తాకిడికి తీవ్రంగా గురవుతారు. ఇప్పటికే అమెరికా వ్యాప్తంగా అన్ని పెద్ద నగరాలలోను వేలాదిగా ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత పెరిగినప్పుడు ఈ ఆందోళనలు మరింత తీవ్రం కాక తప్పవు. అమెరికా ప్రజల ఆగ్రహావేశాలకు ట్రంప్ ఎలా ప్రతిస్పందిస్తారన్నది తెలియాల్సి ఉంది. అనవసరంగా తేనెతుట్టెను కదిపిన ట్రంప్, తనకూ పుతిన్‌కు పెద్దగా తేడా లేదని నిరూపించుకున్నారు. ఆధునిక యుద్ధాలు ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తాయని అనుభవంలోకి వచ్చింది. అమెరికా బాండ్లపై వడ్డీ రేట్ల తీరుతెన్నులను ఆయన తప్పక పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ట్రంప్ సుంకాల దెబ్బను కొన్ని దేశాలు తీవ్రంగానే ప్రతిఘటిస్తున్నాయి. స్పందిస్తున్నాయి. ప్రతీకార సుంకాలను చైనా విధించింది. నీ బెదిరంపులను పట్టుకోబోమని తేల్చింది. కెనడా, యూరోప్ గట్టిగా ప్రతిఘటిస్తున్నాయి. సుంకాల సమరాన్ని అమెరికా అనివార్యం చేస్తే, చైనా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు. రాజీ లేని పోరుకు బీజింగ్ సమాయత్తమై ఉన్నది. ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధంపై భారత్ ఆచితూచి అడుగేస్తోంది. మోదీ ప్రభుత్వం ఈ విషయమై జాగరూకతతో వ్యవహరించడం కూడా ముఖ్యమే. ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడంతో అందరూ సంతోషిస్తున్నారు. ఈ యుద్ధ విరామంతో, ఆయనను ఆర్థిక వివేకం కలిగి ఆలోచన చేస్తే ఆయనతో పాటు..ప్రపంచ దేశాలకు కూడా మంచిదే. కానీ ఇలాగే సుంకాల యుద్ధం కొనసాగిస్తే...దానికి ఫలితం కూడా అనుభవించక తప్పదు. ట్రంప్ విధానాలతో ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి వెడుతోందని ఆర్థికవేత్తలు చాలా మంది గట్టిగా అభిప్రాయపడుతున్నారు.

## తమిళనాడు స్వయంప్రతిపత్తికి కమిటీ.. గవర్నర్‌తో విభేదాల వేళ స్టాలిన్ ప్రభుత్వం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ:బిల్లుల ఆమోదంపై గవర్నర్ ఆర్.ఎన్. రవి తమిళనాడు ప్రభుత్వం మధ్య విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. ఈ విభేదాల వేళ.. ఎంకే స్టాలిన్ ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. తమిళనాడు స్వయంప్రతిపత్తి పై సూచనలకు ఓ కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. స్వయంప్రతిపత్తి కోసం తీసుకోవాల్సిన చర్యలను ఆ కమిటీ సిఫారసు చేయనుంది. ఈ మేరకు సీఎం స్టాలిన్ అసెంబ్లీలో ప్రకటన చేశారు.ఈ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ నేతృత్వం వహించనున్నారు. ఈ కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి అశోక్ వర్ధన్ శెట్టి, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఎం. నాగనాథన్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ రాష్ట్ర స్వయంప్రతిపత్తిని నిర్ధరిస్తుంది. సిఫార్సులతో కూడిన తుది నివేదికను ఈ కమిటీ రెండేళ్లలో ప్రభుత్వానికి సమర్పించనుంది.తమిళనాడు ప్రభుత్వం పంపిన పలు బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదించలేదు. అలాగే అసెంబ్లీ తిరిగి ఆమోదించిన ఈ బిల్లులను తప్పుగా రాష్ట్రపతికి పంపడం



న్యాయపరమైన సవాలుకు దారితీసింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. అసెంబ్లీ తిరిగి ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతికి పంపిన గవర్నర్ చర్య రాజ్యాంగ విరుద్ధం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 200ను ఉల్లంఘించినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో తిరిగి ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదం పొందినట్లుగా పరిగణించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వం తమిళనాడు విశ్వవిద్యాలయాల చట్టాలు (రెండవ సవరణ) 2022, తమిళనాడు ఫిషరీస్ యూనివర్శిటీ (సవరణ) చట్టం 2020 (గతంలో తమిళనాడు డాక్టర్ జే జయలలిత ఫిషరీస్ యూనివర్సిటీగా ఉన్న పేరు మార్పు), ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే యూనివర్సిటీల్లో వైస్ ఛాన్సలర్లను నియమించే అధికారాన్ని గవర్నర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయింపు వంటి చట్టాలను గవర్నర్, రాష్ట్రపతి అనుమతి లేకుండానే ప్రభుత్వ గెజిట్‌లో నోటిఫై చేసింది. ఏప్రిల్ 11న ఆ రాష్ట్ర గెజిట్‌లో పది చట్టాలను అధికారికంగా నోటిఫై చేసింది. ఒక రాష్ట్రం ఇలా చేయడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం.కాగా, భారత రాజ్యాంగం ప్రకారం సాధారణంగా ఒక బిల్లును రాష్ట్ర శాసనసభ ఆమోదించిన తర్వాత గవర్నర్‌కు పంపుతారు. గవర్నర్ ఆమోదిస్తే ఆ బిల్లు చట్టంగా మారుతుంది. అలాగే గవర్నర్ తన సమ్మతిని నిలిపివేయవచ్చు. పునఃపరిశీలన కోసం బిల్లును ప్రభుత్వానికి తిరిగి పంపవచ్చు. లేదా రాష్ట్రపతి పరిశీలనకు రిజర్వ్ చేయవచ్చు. అయితే తిరిగి వచ్చిన బిల్లును మార్పులతో లేదా మార్పులు లేకుండా మళ్లీ శాసనసభ ఆమోదించినట్లయితే గవర్నర్ తప్పనిసరిగా ఆమోదించాలి. దానిని మళ్లీ రిజర్వ్ చేయలేరు. హైకోర్టు లేదా కేంద్రం పరిధిలోని అంశాలను ప్రభావితం చేసే బిల్లు మాత్రం తప్పనిసరిగా రాష్ట్రపతి ఆమోదం కోసం వెళ్లాలి.

## సీఎం ఎక్కిన లిఫ్ట్‌లో స్వల్ప అంతరాయం.. రేవంత్ రెడ్డికి తప్పిన ప్రమాదం..

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఆయన ఎక్కిన లిఫ్ట్‌లో స్వల్ప అంతరాయం ఏర్పడింది. దీంతో సీఎం సెక్యూరిటీ సిబ్బంది, మంత్రులు, ఎమ్మెల్యేలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటన హైదరాబాద్ శివారు శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది.శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమావేశానికి హాజరయ్యారు. మొదటి అంతస్తు నుంచి రెండో అంతస్తులోకి వెళ్లేందుకు సీఎం రేవంత్ లిఫ్ట్ ఎక్కారు. అయితే పరిమితికి మించి ఆ లిఫ్ట్‌లో ఎక్కడంతో అది ఒక్కసారిగా మధ్యలోనే ఆగిపోయింది. దీంతో హోటల్ సిబ్బంది, సీఎం సెక్యూరిటీ అప్రమత్తమయ్యారు. సెక్యూరిటీ సిబ్బంది లిఫ్ట్ డోర్ ఓపెన్ చేసి వేరే లిఫ్ట్‌లో రేవంత్ రెడ్డిని సెకండ్ ఫ్లోర్‌కి పంపారు.ఒక్కసారిగా లిఫ్ట్ ఆగిపోవడంతో.. సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఆ లిఫ్ట్‌లో ఉన్న పలువురు నాయకులు ఉక్కిరి బిక్కిరికి గురైనట్లు తెలుస్తోంది. కాసేపు ఊపిరాడకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురైనట్లు సమాచారం. అయితే ఎనిమిది మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో 13 మంది ఎక్కడంతోనే లిఫ్ట్ ఆగిపోయిందని హోటల్ సిబ్బంది తేల్చారు.తాను ఎక్కిన లిఫ్ట్ ఆగాల్సిన చోటు కంటే రెండు అడుగులు కిందకు లిఫ్ట్ ఆగిపోవడంతో సీఎం తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇక అప్పటికే మంత్రి పదవులపై ఎమ్మెల్యేల ప్రకటనలపై సీరియస్‌గా ఉన్న రేవంత్‌కు.. పీసీసీ మీటింగ్‌కు వెళ్లే క్రమంలో లిఫ్ట్ ఆగిపోవడంతో మరింత ఫ్రస్టేషన్‌కు గురయ్యారు. ఇంకేముంది.. పీసీసీ సమావేశం ప్రారంభం కావడంతో.. ఆఆ ఫ్రస్టేషన్‌ను అంతా ఎమ్మెల్యేలపై తీసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను హెచ్చరించారు. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ అని చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని అన్నారు. మీరు మాట్లాడేదంతా రికార్డవుతుందని హెచ్చరించారు.



## వీకెండ్ రాజకీయాలు చేయొద్దు.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు క్లాస్ పీకిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. తనకు మంత్రి పదవి రాకుండా జానా రెడ్డి అడ్డుకుంటున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రచ్చ చేస్తే.. పదేళ్లు పార్టీని కాపాడుకున్న మమ్మల్ని కాదని.. వేరే పార్టీలు తిరిగొచ్చిన వారికి పదవులు ఇస్తారా అని ప్రేమ్‌సాగర్ రావు పరోక్షంగా ప్రభుత్వానికే వార్నింగ్ ఇచ్చారు. ఇలా ఒక్కొక్కరుగా కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంపై సీఎం రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు క్లాస్ పీకారు. మంత్రి పదవులను అధిష్ఠానం చూసుకుంటుందని తెలిపారు.హైదరాబాద్ శివారు శంషాబాద్ నోవాటెల్‌లో కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను హెచ్చరించారు. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ అని చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని అన్నారు. మీరు మాట్లాడేదంతా రికార్డవుతుందని హెచ్చరించారు.కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ సోషల్‌మీడియా వాడటం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వంపై నెగిటివ్ ప్రచారం చేస్తుంటే.. ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పలువురు ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారని అన్నారు. వీకెండ్ రాజకీయాలు చేయొద్దని సూచించారు.

## కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను నమ్మి గోసపడుతున్న ప్రజానీకం : జగదీశ్‌రెడ్డి



వలిగొండ, ఏప్రిల్ 15 : కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను నమ్మి తెలంగాణ ప్రజానీకం గోసపడుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం వలిగొండ మండల పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వేములకొండ గుట్ట నుండి యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వల్లమాల్ల కృష్ణ, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్గు నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన మహా పాదయాత్రను ప్రారంభించి మాట్లాడారు.సిన తెలంగాణలో వ్యవసాయం నాశనం అయిపోయి రైతులకు ఏడుపే మిగిలిందని, మహిళలు, కూలీలు, ఆటో కార్మికులు, యువజనులతో పాటు యావత్ తెలంగాణ సమాజం మోసపోయి గోసపడుతుందన్నారు. కేసీఆర్ పాలనే బాగుందని, కేసీఆర్ ఉంటే బాగుండేదని తెలంగాణ సమాజంలో చర్చ జరుగుతుందని తెలిపారు. ఈ 27వ తేదీన వరంగల్ మహాసభకు లక్షలాదిగా తరలివచ్చి కేసీఆర్‌కు మరింత శక్తిని అందించి జయప్రదం చేయాలని కోరారు.మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. యువజన విభాగం, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర జయప్రదం కావాలని ఆకాంక్షించారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల నుండి లక్షలాదిగా రజితోత్సవ మహాసభకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ అధ్యక్షుడు గొంగడి మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, చింతల వెంకటేశ్వరరెడ్డి, క్యామ మల్లేశం, పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, మొగుళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురకంటి వెంకట్ రెడ్డి, పడమటి మమతా నరేందర్ రెడ్డి, ముద్దసాని కిరణ్ రెడ్డి, కొమరెల్లి సంజీవరెడ్డి, దేగల పాండరీ, కునపురి కవిత, పల్చం రమేశ్, గూడూరు శేఖర్ రెడ్డి, జానీ అప్రోచ్, మద్దెల మంజుల పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు.



ఎడపల్లి ఏప్రిల్ 15( లోకం తీరు). ఎడపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞత తెలియజేస్తూ ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీ దల్లా సురేష్ మాదిగ ఎస్సీ వర్గీకరణ అమలుతో దళిత జాతిలోని నేటి విద్యార్థులే రేపటి పౌరులుగా ఎదగడానికి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు సంపూర్ణ అవకాశాలు ఉంటాయని అందుకని ఈరోజు చిన్నారుల సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞత భావం తో ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. ఎందుకంటే ఈ దేశంలోనే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉంటుందని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన రేవంత్ రెడ్డి ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని ఎస్సీ రిజర్వేషన్లు అమలుకై గెజిట్ విడుదల చేయడం యావత్ మాదిగ జాతే కాదు దళిత జాతి కూడా హర్షం వ్యక్తం చేస్తుందని అదే సమయంలో 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణకై పోరాడుతున్న ఎంఆర్పిఎస్ ఆకాంక్షలను సీఎం రేవంత్ రెడ్డి నెరవేర్చడంతో ఎస్సీలలో ఉన్న అన్ని కులాలు నేటి నుండి ఎలాంటి విభేదాలు లేకుండా ఐక్యమత్యంగా ఉండడానికి దారితీస్తుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం. దళితులకు రిజర్వేషన్లు ఆనాడు కాంగ్రెస్ పార్టీ కల్పించిందని నేడు దళితులలో ఉన్న ఉమ్మడి రిజర్వేషన్లు వర్గీకరణను నేడు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని సీఎం రేవంత్ రెడ్డి నిరూపించారు.ఇందుకు యావత్ దళిత జాతి అంతా సీఎం రేవంత్ రెడ్డికి అండగా ఉండాల్సిన అవసరం ఉందని రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీతోనే దళితుల సమగ్ర అభివృద్ధి ఉంటుందని పూర్తి విశ్వాసంతో తెలియజేస్తున్నాం..ఒకపక్క ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు కల్పించిన కేంద్ర ప్రభుత్వం, 30 ఏళ్ల పోరాట నేపథ్యమున్న ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ద్వారా తీర్పు ఇవ్వడం అంటే మళ్ళీ ఎస్సీ వర్గీకరణ సమస్యపై పేచి పెట్టడమే అని మాదిగ జాతి మర్చిపోవద్దని.దేశంలోనే అత్యధిక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పును ఎందుకు అమలు చేయడం లేదో మాదిగ ఉద్యమ నాయకత్వం ప్రశ్నించాల్సింది పోయి ఎస్సి రిజర్వేషన్ వర్గీకరణను అమలు చేసిన రేవంత్ రెడ్డిని బదలాం చేయడం సరికాదని మాదిగ రాజకీయ పోరాట సమితి నిజామాబాద్ జిల్లా కమిటీ పక్షాన గుర్తు చేస్తున్నాం. మాదిగ జాతి చిన్నారుల భవిష్యత్తుకు పునాది వేసిన తెలంగాణ ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి కి మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు

## నేలరాలిన ఉద్యమ కెరటం,ఆర్మూర్ కెసిఆర్( కుంట గంగ మోహన్ రెడ్డి, ఇక లేరు.)

ఆర్మూర్ ఏప్రిల్ 15 (లోకం తీరు )తెలంగాణ రాష్ట్రం ఉద్యమ ప్రక్రియలో ఆయన ఒక కీలకమైన వ్యక్తి తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న తరుణంలో ఆయన ఒక దిక్సూచి. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తో కలిసి ఉద్యమంలో పనిచేసిన వ్యక్తి నిజామాబాద్ జిల్లా అంతట ఆ వ్యక్తి తెలియని వారంటూ లేరు. తెలంగాణ రాష్ట్రం కోసం అంబాసిడర్ కారుకు పూర్తిగా గులాబీ రంగు వేసి తెలంగాణ ఉద్యమంలో గ్రామ గ్రామానికి ఆ కారు లో ప్రచారం చేశారు. ఆర్మూర్ ప్రాంత ప్రజలకు ఆయన ఒక సుపరిచితుడు ఆయనంటే అందరికీ అభిమానం ఆయన డ్రెస్ కోడ్ చూస్తే ఒక ప్రజా ప్రతినిధి మినిస్టర్ లెవల్లో ఆయన డ్రెస్ కోడ్ ఉండేది, ప్రతి ఒక్కరితో మర్యాదతో కలిసిమెలిసి ఉండేవారు.చిన్న పెద్ద తేడా లేకుండా అందరితో కలుపుగోలుగా ఉండే ఆయన ఇక లేరు అనే సంఘటనను ఆర్మూర్ ప్రాంత ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఏది ఏమైనాప్పటికీ ఆయన రాష్ట్రం కోసం చేసిన త్యాగం మర్చిపోలేనిది అకాల మరణంతో ఆర్మూర్ ప్రాంతమంతా షోకాప్త హృదయాలతో నిండిపోయింది ఎలాంటి ఆర్థిక వనరులను కూడబెట్టుకోకుండానే ఆయన జీవితం అర్ధాంతరంగా ముగిసిపోయింది, కాలం ఎవరిని ఎప్పుడు కాటేస్తుందో తెలియని జీవితం దహన సంస్కరణ కార్యక్రమంలో గోవింద్ పెట్ ఆనంద్ రెడ్డి, కోటపాటి నరసింహనాయుడు, తెలంగాణ ఉద్యమకారుడు మిట్టపల్లి గంగారెడ్డి, అంకాపూర్ నడికుడ భూమారెడ్డి,అల్లూరు గంగారెడ్డి, వన్నెల దేవి సంతోష్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## మానుకోట రోడ్డుకు వనజీవి రామయ్య పేరు పెట్టాలి : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 15 : తన జీవితం మొత్తం మొక్కలు నాటాడానికే అంకితం చేసిన పద్మశ్రీ దరిపల్లి రామయ్య ధరిత్రి ఉన్నంతకాలం చిరస్థాయిగా నిలిచి ఉంటారని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఇటీవల మృతి చెందిన వనజీవి రామయ్య రెడ్డిపల్లిలోని నివాసానికి వెళ్లి ఆయన చిత్ర పటానికి ఎంపీ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వద్దిరాజు మాట్లాడుతూ.. రామయ్య పేరు ఎప్పటికీ గుర్తుండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం-మహబూబాబాద్ రోడ్డుకు వనజీవి రామయ్య మార్గ్ పేరుతో నామకరణం చేయాలని కోరారు.ఖమ్మం నుంచి రెడ్డిపల్లి వరకు 8 కిలోమీటర్ల మేర వనజీవి రామయ్య మొక్కలు నాటిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఆ చెట్లన్నీ కూల్చేసినందున, మళ్లీ అదే వరసలో మొక్కలు నాటి సంరక్షించి రామయ్యకు నివాళులు అర్పించాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలి

## దళారులను నమ్మి మోసపోవద్దు

నిజామాబాద్,ఏప్రిల్15): రైతులు దళారులను నమ్మి మోస పోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యం విక్రయించి పూర్తి మద్దతు ధర పొందాలని మార్కెటింగ్ అధికారులు సూచించారు. తూకాల్లో మోసం జరుగకుండా డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేశాం. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యం విక్రయించాలన్నారు. ప్రభుత్వం వరి పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకుంటోంది. ధాన్యం డబ్బును బ్యాంకు ఖాతాలో వేయడంతో పాటు తూకాల్లో ఎలాంటి మోసాలు జరుగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిని అన్నదాతలు అర్థం చేసుకుని ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి. ప్రతీ మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల పంటను తరలించేందుకు అయ్యే ఖర్చును తగ్గిచ్చేందుకు కృషి చేస్తోంది. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. డిజిటల్ తూకం మిషన్, మద్దతు ధరతో పాటు సకాలంలో రైతులకు డబ్బులు అందిస్తున్నారు.ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ధాన్యం కొనుగోలు అమ్మకునేందుకు దళారులను ఆశ్రయించడంతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. దీనిని గమనించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు వరి ధాన్యాన్ని పెద్ద ఎత్తున ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు చేరుస్తున్నారు. రైతుల వద్ద నుంచి పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు పాస్ బుక్, ఆధార్ నంబర్లను సేకరించి తేమ 17 శాతం వరకు ఉంటేనే మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. రైతుల అకౌంట్లలో నాలుగైదు రోజుల్లో నగదు చేరేలా చర్యలు చేపడుతున్నారు.

# నల్ల పోచమ్మ బోనాల పండుగలో పోచారం







బాన్సువాడ పట్టణం ,ఏప్రిల్15:బాన్సువాడ పట్టణ కేంద్రంలోని 12 వ వార్డులో నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో జరిగిన బోనాల పండుగలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి , రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు బోనం ఎత్తుకొని అమ్మవారికి బోనం సమర్పించిన పోచారం ఈ సందర్భంగా అమ్మవారి దీవెనలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని,ప్రతి ఒక్కరికి ఆ తల్లి దీవెనలు లభించాలని కోరుకున్న పోచారం ఈ బోనాల పండుగలో బాన్సువాడ పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు


# బి ఆర్ ఎస్ రజతోత్సవ సభ కోసం ఎంఎల్ ఏ వాల్ రైటింగ్

కమ్మ ర్ పల్లి,ఏప్రిల్15: బి అర్ ఎస్ రజతోత్సవ విస్తృత ప్రచారంలో భాగంగా ఎంఎల్ ఏ వేముల ప్రశాంత్ రెడ్డి వాల్ రైటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ నెల 27 న వరంగల్ లో జరగబోయే బి అర్ ఎస్ పార్టీ రజతోత్సవ భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరుతూ బాల్కొండ నియోజకవర్గం కమ్మర్పల్లి మండల కేంద్రంలో రాస్తున్న వాల్ రైటింగ్ వద్ద ఆగి కాసేపు వాల్ రైటింగ్ రాసిన మాజి మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి.వరంగల్ సభకు నియోజకవర్గం నుండి వేలాది గా తరలివెళ్తాము అని ,సభకు స్వచ్ఛందంగా తరలిరావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే అన్నారు.




# నేడు తెలుగు నాటకరంగ దినోత్సవం

## సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి




(పెండ్యాల రామ్ కుమార్, మంథని)

తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 16న నిర్వహిస్తారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007లో తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది. నాటక ప్రదర్శనతోపాటు నాటకానికి సంబంధించిన అనేక అంశాలపై సదస్సులు జరగాలని, నాటక కళాకారుల జయంతులను వర్ధంతులను నిర్వహించడం ద్వారా ప్రజల్లో నాటక కళ పట్ల ఉత్సాహం, విలువలు పెరుగుతాయని, వీటన్నింటిని సమతుల్యం చేసేలా ఉండేందుకు నాటకరంగ దినోత్సవాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలుగు నాటక కళాకారులు భావించారు. అయితే, ఏ రోజును నాటకరంగం దినోత్సవంగా చేయాలన్న అంశంపై అనేక చర్చలు జరిగాయి. అనేకమంది అనేక పేర్లూ, తేదీలు సూచించారు.

దీనికి 2000వ సంవత్సరంలో బీజం పడింది. 2000వ సంవత్సరంలో కొంతమంది యువనాటక కళకారులతో కలిసి డా. పెద్ది రామారావు ఆధ్వర్యంలో యవనిక త్రైమాసిక నాటకరంగ పత్రిక ప్రారంభమయింది. నాలుగేళ్ళపాటు నడిచిన ఈ పత్రికలో ప్రపంచ, భారతీయ, తెలుగు నాటకరంగాలకు సంబంధించి నాటక ముఖ్యులు, ఔత్సాహికులు రాసిన అనేక వ్యాసాలను యవనిక ప్రచురించడంతోపాటు నాటకరంగ కార్యక్రమాలు, నాటకోత్సవాలను కూడా నిర్వహించింది. నాటకరంగాన్ని మరింత పటిష్టపరచడంకోసం ఇతర దేశాల, రాష్ట్రాల నాటకరంగానికి ఉన్నట్లుగా తెలుగు నాటకరంగానికి కూడా ఒక దినోత్సవం ఉంటే బాగుంటుందని భావించి, “ఏప్రిల్ 16 తెలుగు నాటక దినోత్సవం” శీర్షికతో 2000 ఏప్రిల్–జూన్ ప్రత్యేక యవనిక సంచికను ప్రచురించింది. యవనిక ఆలోచనకు “ఆంధ్రప్రదేశ్ రంగస్థల కళాకారుల ఐక్య వేదిక” సహకారం తోడైంది. తెలుగు నాటక కళాకారులంతా నాటకరంగ దినోత్సవ ఏర్పాటుపై ఏకాభిప్రాయానికి వచ్చారు. 19వ శతాబ్దంలో అనువాద నాటకాలకు అధిక ప్రాధాన్యమున్న సమయంలో ప్రదర్శనలను దృష్టితో ఉంచుకొని కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకం రాసి, షేక్స్పియర్ రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే అంగ్ల నాటకాన్ని చమత్కార రత్నావళి పేరుతో 1880లో అనువదించి తన విద్యార్థుల చేత ప్రదర్శిపంచేశాడు. అంతేకాకుండా తెలుగు నాటకరంగంలో తొలి నాట క సమాజాన్ని కూడా వీరేశలింగమే స్థాపించాడు. ఆధునిక తెలుగు నాటకరంగానికి విశిష్ట సేవలను అందించిన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని నాటక సంస్థ లు 2001 నుండి తెలుగు నాట కరంగ దినోత్సవంగా జరుపాయి. ఈ క్రమంలో డా. కె.వి. రమణాచారి ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళగా, కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని తెలుగు నాటకరంగ దినోత్సవంగా ప్రకటిస్తూ 2007 మార్చి నెలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ. విడుద లచేసింది. 2007, ఏప్రిల్ 16న తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా తెలుగు నాటకరంగ దినోత్సవం జరుపబడింది. వివిధ సంస్థల ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా అనేక ప్రాంతాల్లో నాటక ప్రదర్శనలు, సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తారు. తెలుగు నాటకరంగంలో విశేష కృషి చేసిన నాటక సన్మానాలు, సత్కారాలు, పురస్కారాలు, బిరుదులు అందజేస్తారు.

# పర్యావరణ విధ్వంసం పట్టని ప్రజలు

## పెరుగుతున్న ఎండలతో జనం అవస్థలు

## మొక్కలు నాటాలన్న స్పృహ లేని సమాజం

న్యూఢిల్లీ,ఏప్రిల్15(: పర్యావరణ విధ్వంసంపై దృష్టి పెట్టకపోవడంతో భానుడు చెలరేగి పోతున్నాడు. ఎండ వేడిమి, వడ గాడ్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉత్తరభారతం అయితే క్రమంగా నిప్పుల కొలిమిలా తయారవుతోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ యేడు చలికాలం వణికిస్తే.. ఎండాకాలం ఉడికిస్తోంది. ఇలాంటి విపరీత వాతావరణ పరిస్థితులకు మనం చేస్తున్న విధ్వంసం కారణమని గుర్తించడం లేదు. పాలకులతో పాటు.. ప్రజలు కూడా ఇందుకు బాధ్యులే. కొన్ని రోజులుగా క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోతోంది. మేఘాలు తొలగిపోయి పూర్తిగా పొడి వాతావరణం ఏర్పడడంతో సూర్యుని కిరణాలు నిటారుగా తాకుతుండ టంతో రేడియేషన్ పెరిగి భూమి బాగా వేడెక్కి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మే వరకు ఇదే పరిస్థితి కొనసాగ నుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో పరిశుభ్రత, పారిశుద్ధ్యానికి పెద్దపీట వేయాల్సిఉంది. పర్యావరణ పరిరక్షణ తమ బాధ్యత కాదన్న రీతిలో ఉండడం వల్లనే చెట్లను నరికేస్తున్నా చోద్యం చూశారు. అందుకే ఏటా మొక్కలు నాటుతున్నా..భూగర్భ జలాలు ఇంకేలా చేస్తున్నా.. ఏయేటి కాయేడు దేశంలో ఎండలు మండి పోతున్నాయి. ఇకపోతే ప్రస్తుత పరిస్తితులు చూస్తుంటే ఇదంతా మనకుగా మనం చేసుకున్న పర్యావరణ విధ్వంసానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పుకోవాలి. అడవులను నరకడం, కాంక్రీట్ జంగల్‌ను పెంచడం, మొక్కల పెంపకాన్ని విస్మరించడం, భూగర్భ జలాలను తోడేయడం, ఇసుకను తవ్వితీయడం వంటి అనేకానేక చర్యలు ఇందుకు కారణ మయ్యాయి. దీనికితోడు పర్యావరణ విధ్వంసానికి తోడ్పడే ప్లాస్టిక్ విపరీతంగా వినియోగిస్తున్నాం. ప్లాస్టిక్ ఎంతటి విధ్వంసం సృష్టిస్తుందో ఎండలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఏటా విధ్వంసం జరుగుతున్నా దానిని అడ్డుకునే కఠిన చర్యలను అవలంబించడం లేదు. ఎవరికి వారు మాకేంటి లే అన్న ధోరణిలో ఉన్నారు. ఇవే మనలను అనేకానేక రోగాలకు కారణం చేస్తున్నాయి. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా మంచినీటి సమస్య కూడా తీవ్రం అయ్యింది. ఇలాగే మనం ముందుకు సాగితే దేశం ఎడారిగా మారుతుందనడంలో సందేహం లేదు. దశాబ్దాలుగా దేశంలో

పర్యావరణ హితమైన చర్యలకు పాలకులు కట్టుబడకపోవడం వల్ల పచ్చదనం మాయమయ్యింది. పచ్చదనం అన్నది లేకుండా పల్లెల్లో ఉన్న చెట్లను ఎక్కడిక్కడ నరికి వేశారు. గతంలో ఇంటిముందు ఉండే చెట్లను కూడా డబ్బుకోసం అమ్ముకున్నారు. ఇప్పుడు చాలా గ్రామాల్లో కోతుల బెడద కారణంగా చెట్లను తెగనరికే స్తున్నారు. అందుకే తెలుగు రాష్ట్రాలు ఎండవేడిమికి అతలాకుతలం అవుతు న్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. మండే ఎండలకు తోడు రెండు రాష్ట్రాల్లోను తాగునీటికి కటకట ప్రారంభం అయింది. మూడునుంచి నాలుగు డిగ్రీలు సాధారణ ఉష్ణోగ్రతలకు అదనంగా నమోదవుతుండటంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఉదయం నుండే మొదలవుతున్న ఎండవేడిమి సాయంత్రం అయినా ఎక్కడా తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఏటా ఎండాకాలం బాధలను వానాకాలంటో గుర్తుంచుకోక పోవడం వల్ల మంచినీటి సమస్యలు పునరావృతం అవుతున్నాయి. తాగునీరు కాదుకదా రోజువారీ వాడకానికి సరిపడా నీటికి కూడా కటకట తప్పడం లేదు. ప్రధాన జలాశయాలు అడుగంటి పోవడంతో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకున్నాయి. పాలకులు కూడా కఠినంగా చర్యలు తీసుకుని పర్యావరణ విధ్వంసాన్ని ఆపకపోతే రానున్న రోజులు మరింత భయంకరంగా ఉండడం ఖాయమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇంతకాలం మనం చేసిన విధ్వంసం కారణంగానే అన్ని ప్రాంతాల్లో సాధారణం కన్నా మించి ఉ ష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనీసం ఒక్కొక్కరు ఒక్కో మొక్క నాటుతూ పోయినా కొంతయినా ఉపశమనం లభించేది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే వైరస్‌లు ఇకముందు కూడా దాడి చేస్తాయని గుర్తించాలి. ప్రభుత్వాలను తిడుతూ కూర్చునే బదులు మన ఇంటినుంచే పరిశుభ్రత అన్నద అలవాటు కావాలి. మొక్కలను పెంచడం మన బాధ్యత కావాలి.

# అటకెక్కిన మొక్కల పెంపకం

## ఎక్కడా కానరాని నర్సరీల హడావిడి

## సామాజిక అడవ్వుల బాధ్యతను విస్మరించిన మంత్రి

నిజామాబాద్,ఏప్రిల్15: తెలంగాణలో చేపట్టిన హరితహారం మంచి ఫలితాలు ఇచ్చింది. అయితే అందులో మంచిచెడులను విశ్లేషించి ముందుకు సాగాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా ఎక్కడా ఆ కార్యక్రమానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. మొక్కలను నాటాలని సోషల్ ఫారెస్ట్, ఈజీఎస్ శాఖల అధికారులు దృఢనిశ్చయంతో గతంలో పనిచేశారు. కోతులు వాపస్ పోవాలన్న కెసిఆర్ నినాదాం కూడా బాఆనే పనిచేసింది. కానీ ఇప్పుడు అలా జరగడం లేదు. మానవజాతి మనుడగకు చెట్లు సజీవసాక్ష్యం. వృక్షాలు అంతరించడం వల్లనే సరైన వర్షాలు కురువడం లేదని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. వరుణ దేవుడు కరుణించడంతో చాలాచోట్ల నాటిన మొక్కలు జీవం పోసుకున్నాయి. అయితే ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇది నిరంతరాయంగా కొనసాగాలి. దీనికి పెద్దపీట వేయాలి. హరితహారాన్ని ఒక మహోత్తర ఉద్యమంగా ముందుకు తీసుకెళ్ళాలని కెసిఆర్ సన్నాహాలు చేసారు. మొక్కలు నాటించి ఈజీఎస్ కూలీల ద్వారా నాటిన మొక్కల చుట్టూ రక్షణ కంచెలు సైతం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేసారు. గత హరితహారంలో పాఠశాల, ప్రభుత్వ దవాఖాన, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో నాటిన మొక్కలకు ప్రతిరోజు నీరుపట్టేలా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల ఖర్చుతో వివిధ శాఖల ఆధ్వర్యంలో పండ్లు, పూలు, అటవీ, మిశ్రమ జాతి మొక్కలతో ఇతర మొక్కల పెంపకాన్ని చేపట్టింది. వన విభాగం కింద ఒకటి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నర్సరీలను నెలకొల్పి మొక్కల పెంపకం చేపట్టారు. ఈ నర్సరీల్లో పండ్ల విభాగంలో జామ, ఉసిరి, నిమ్మ, బొప్పాయి, కర్జూరా, ఫ్లవరింగ్, సాధారణ మొక్కలు కానుగ, చింత, నీలగిరి, కుంకుడు, వెదురు, వంటి మొక్కలు పెంచారు. నర్సరీలో ఉన్న మొక్కలకు నీరుపట్టి బతికించేందుకు సంబంధిత అధికారులు చొరవ తీసుకుంటూ, ఆయా నర్సరీ బాధ్యులకు ఎప్పటి కప్పుడు సూచనలు ఇస్తూ, వాటిని సందర్శిస్తూ, మొక్కల ఎదుగుదల తీరును పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం కాగానే జూలైలో కార్యక్రమం ప్రారంభం అయ్యేది. కానీ అటవీశాఖ మంత్రిగా కొండా సురేఖ అడవుల రక్షణ పెంపకంపై ఎక్కడా శ్రద్ధ పెట్టడం లేదు. నిరంతరాయంగా మొక్కలు పెంచే విధంగా కార్యాచరణ చేయడం లేదు. దీంతో మొక్కల పెంపకం అటకెక్కింది.

# అలహాబాద్ హైకోర్టు తీర్పులపై సుప్రీంకోర్టు అభ్యంతరం



న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు ఇస్తున్న తీర్పులపై .. అత్యున్నత న్యాయస్థానం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ హైకోర్టు నుంచి ఇటీవల వెలుబడిన కొన్ని తీర్పులను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. తన సమస్యను తానే కొని తెచ్చుకున్నట్లు ఇటీవల ఓ కేసు తీర్పు సమయంలో రేప్ బాధితురాలని అలహాబాద్ హైకోర్టు తప్పుపట్టిన విషయం తెలిసిందే. ఈ కేసులో హైకోర్టు చేసిన వ్యాఖ్యలను ఇవాళ సుప్రీంకోర్టు ప్రశ్నించింది. మహిళలపై లైంగిక దాడి జరుగుతున్న కేసుల్లో.. తీర్పులు ఇస్తున్న జడ్జీలు అనుచిత వ్యాఖ్యలు చేయరాదు అని సుప్రీంకోర్టు తెలిపింది.జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాషితో కూడిన ధర్మాసనం.. ఇటీవల అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును తీవ్రంగా తప్పుపట్టింది. కేసు విషయంలో బెయిల్ ఇచ్చే అధికారం పూర్తిగా జడ్జి ఆధీనంలోనే ఉంటుందని, ఆ కేసుకు చెందిన సాక్ష్యాల ఆధారంగా బెయిల్ ఇవ్వవచ్చు అని, కానీ బాధితులపై అనవసరమైన వ్యాఖ్యలు చేయరాదు అని సుప్రీంకోర్టు చెప్పింది. వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు జడ్జీలు చాలా జాగ్రత్తగా ఉండాలని జస్టిస్ గవాయి తెలిపారు.వీ ద వుమెన్ ఆఫ్ ఇండియా సంస్థ దాఖు చేసిన సుమోటో కేసుపై విచారణ చేపడుతూ సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. చేతులతో మైనర్‌ను వేధించడం, పైజామా విప్పడం లాంటి చర్యలు అత్యాచారం యత్నం కిందకు రావు అని ఓ కేసులో హైకోర్టు ధర్మాసనం చెప్పడాన్ని కూడా సుప్రీంకోర్టు తప్పుపట్టింది.

# రోడ్డు భద్రతా నియమాలను ప్రతీ ఒక్కరూ పాటించాలి: సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 15: రోడ్డు దాటే సమయంలో ప్రతీ ఒక్కరూ సంయమనం పాటించాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ ఏ నాగరాజు అన్నారు. ఇవాళ కొంపల్లిలో రోడ్డు ప్రమాదాల నివారణపై అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు నేతృత్వంలో పాదాచారులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ సిగ్నల్స్ అనుసరించి వాహనాల రాకపోకలను గమనిస్తూ.. సురక్షితంగా రోడ్డు దాటి గమ్య స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ప్రధాన రహదారులపై రోడ్డు దాటేందుకు పాదాచారులకు ప్రత్యేక ఫుట్ పాత్‌లను ఏర్పాటు చేశామని.. దానికి అనుగుణంగా ఇతర ప్రాంతాల్లో రోడ్లు దాటేందుకు ప్రయత్నాలు చేయరాదన్నారు.ఎవరు కూడా సెల్ ఫోన్ మాట్లాడుతూ రోడ్డు దాటరాదని, రోడ్డు దాటేటప్పుడు వచ్చిపోయే వాహనదారులకు చేయి అడ్డుపెట్టాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతీ ఒక్కరూ పాటించి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరాలని సీఐ నాగరాజు ఆశించారు.



# హార్వర్డ్ యూనివర్సిటీకి ౨౦౦ కోట్ల డాలర్ల నిధుల్ని నిలిపేసిన ట్రంప్ సర్కార్

న్యూయార్క్: అమెరికాలోని ట్రంప్ సర్కారు.. కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. హార్వర్డ్ యూనివర్సిటీకి సుమారు రెండు వందల కోట్ల డాలర్ల నిధుల్ని ఆపేసింది. ఆ మొత్తం నిధుల్ని సీజ్ చేసినట్లు ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. శ్వేతసౌధం విధించిన డిమాండ్లను యూనివర్సిటీ అంగీకరించలేదు. దీంతో ఆ వర్సిటీకి అందాల్సిన నిధుల్ని నిలిపివేశారు.వారం క్రితం హార్వర్డ్ వర్సిటీకి కొన్ని డిమాండ్ల జాబితాను వైట్‌హౌజ్ పంపింది. క్యాంపస్‌లలో యూద వ్యతిరేక విధానాలను




అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని శ్వేత సౌధం కోరింది. దీనిలో భాగంగా వర్సిటీ పరిపాలనా మార్పులు చేయాలని సూచించింది. సిబ్బందిని అద్దె తీసుకునే విధానం, అడ్మిషన్ల ప్రక్రి యలో మార్పులు చేయాలని వైట్‌హౌజ్ కోరింది.కానీ ట్రంప్ సర్కారు చేసిన అభ్యర్థనను హార్వర్డ్ యూనివర్సిటీ తిరస్కరించింది. తమపై ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని హార్వర్డ్ వర్సిటీ ఓ ప్రకటనలో తెలిపింది. విధానాలను మార్చుకోవాలని ట్రంప్ సర్కారు చేసిన సూచనను వ్యతిరేకించిన తొలి వర్సిటీగా హార్వర్డ్ నిలిచింది.యూద విద్యార్థులకు రక్షణ కల్పించడంలో ప్రఖ్యాత యూనివర్సిటీలన్నీ విఫలం అవుతున్నాయని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. గాజా యుద్ధం , ఇజ్రాయిల్‌కు మద్దతు ఇవ్వడం వంటి అంశాల నేపథ్యంలో అమెరికాలోని వర్సిటీల్లో ఆందోళనలు జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వం చేసిన డిమాండ్లకు తలొగ్గడం లేదని హార్వర్డ్ వర్సిటీ ప్రెసిడెంట్ అలన్ గార్బర్ ఓ లేఖలో తెలిపారు. డిమాండ్ల అంగీకరించకుంటే ఆర్థిక సాయం అందదని ప్రభుత్వం హెచ్చరించిందని ఆయన చెప్పారు.

# సినిమా తీరు

## గోపీచంద్ కోసం మరో ఇద్దరు క్యూలోనా!



టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని బాలీవుడ్ డెబ్యూ 'జాట్' తో భారీ విజయం అందుకున్నాడు. గోపీ అనుకున్న కమర్షియల్ పార్ములా అక్కడా వర్కౌట్ అయింది. ఇప్పటికే సినిమా బాక్సాఫీస్ వద్ద వసూళ్లతో దూసుకుపోతుంది. ఏప్రిల్ 10న రిలీజ్ అయిన సినిమాకు మంచి ఓపెనింగ్స్ దక్కాయి. పోటీగా మరో హిందీ చిత్రం కూడా లేకపోవడంతో జాట్ కి ఈ వారం కూడా బాగానే కలిసొస్తుంది. సన్నిడియోల్ యాక్షన్ సన్ని వేశాలకు నార్త్ ఆడియన్స్ బాగా కనెక్ట్ అవుతున్నారు.ఇడ్లీ ఫైట్ ఇప్పుడు మార్కెట్ లో ఊపేస్తుంది. ఇంటర్నెట్ లో లీక్ అయిన ఆ ఫైట్ సన్నివేశం యాక్షన్ ప్రియుల్ని అలరిస్తుంది. దీంతో తెలుగు రిలీజ్ కోసం ఆడియన్స్ యాక్షన్ ఆడియన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అంతే కాదు బాలీవుడ్ హీరోలకు ఈ ఫైట్ బాగా కనెక్ట్ అయింది. దీంతో గోపీచంద్ కోసం అప్పుడే ఇద్దరు యాక్షన్ స్టార్లు క్యూలో ఉన్నారంటూ ప్రచారం మొదలైంది. అజయ్ దేవగణ్, టైగర్ ష్రాప్ ఇలాంటి యాక్షన్ స్టోరీలో నటించాలని ఉందనే ఆసక్తి వ్యక్తం చేస్తున్నారుట. 'జాట్' లో యాక్షన్ సన్నివేశాలు బాలీవుడ్ లో యాక్షన్ మేకింగ్ కి డిఫరెంట్ గా ఉండటంతో ఈ నయా స్టార్లు ఇద్దరు ఇంట్రెస్ట్ గా ఉన్నట్లు తెలుస్తుంది. ఇది టాలీవుడ్ మాస్ యాక్షన్ కావడం అక్కడ ఆడియన్స్ సహా హీరోలకు కొత్త అనుభూతి కలుగుతుంది. అందుకే ఈ నయా స్టార్లు ఆసక్తిగా ఉన్నట్లు కనిపిస్తుంది. అజయ్ దేవగణ్, టైగర్ ష్రాఫ్ ఇద్దరు భారీ యాక్షన్ స్టార్లే. యాక్షన్ లో వాళ్లకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ఉంది. మరి ఇద్దరు కాన్ఫిడెంట్ గా ముందుకొస్తే గోపీచంద్ కి ఎలాంటి అభ్యంతరం ఉండదు. టాలీవుడ్ లో స్టార్ హీరోలంతా బిజీగా ఉన్న నేపథ్యంలో అతడికి హీరోలు అవసరం ఉంది. అజయ్...టైగర్ లాంటి టాప్ స్టార్లు ముందుకొస్తే అతడెందుకు కాదంటాడు.

## అనిరుద్ కి పోటీగా మరో సంచలనం!

'కొలవరెడీ' పాటతో అనిరుద్ సౌత్ లో ఓ సంచలనంగా మారాడు. అటుపై అనిరుద్ సంగీతం అందించిన సినిమాలు వరుసగా విజయం సాధించడంతో పాటు రిలీజ్ కు ముందే ఆ సినిమాలు మ్యూజికల్ గా సంచలనం అవ్వడంతో అతడి పేరు ఇండస్ట్రీలో మారుమ్రోగిపోయింది. అటుపై 'విక్రమ్', 'జైలర్' విజయం తర్వాత పాన్ ఇండియాలో పెను సంచలనం అయ్యాడు. ఆ సినిమాలు పాటలు...బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తో ఇండియా అంతా అతడి వైపు చూసింది. ఎవరీ యువ సంచలనం అంటూ అంతటా చర్చనీయాంశమయ్యాడు. 'దేవర'తోనూ మ్యూజికల్ గా మంచి సక్సెస్ అందుకున్నాడు. దీంతో తెలుగు సినిమా అవకాశాలు కూడా పెరిగాయి. అయితే అనిరుద్ కి పోటీగా ఇప్పుడో యువ సంచలనం రెడీ అయ్యాడు. అతడే జీ.వి ప్రకాష్. 'అమరన్', 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాలతో జీవి పేరు సౌత్ లో మారుమ్రోగిపోతుంది. 'అమరన్' బ్లాక్ బస్టర్ అవ్వడంతోనే జీవి పేరు బాగా వెలుగులోకి వచ్చేసింది.అందులో క్లాసిక్ సాంగ్స్ తో పాటు..అద్భుతమైన ఆర్ ఆర్ ని అందించి అటెన్షన్ డ్రా చేసాడు. ఇక రీసెంట్ రిలీజ్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ'లో ఆర్ ఆర్ లో అనిరుద్ కి సరైన రీప్లేస్ మెంట్ అవుతాడనే అంశం చర్చకొచ్చింది. గ్యాంగ్ స్టర్ స్టోరీలకు ఆర్ ఆర్ కొట్టాలంటే అనిరుద్ పేరే ఇప్పటి వరకూ వినిపించేది. కానీ 'గుడ్ బ్యాడ్ అగ్లీ 'తర్వాత అనిరుద్ లేకపోయినా జీవి వాయించేస్తాడు? అన్న ధీమా మేకర్స్ లో



కనిపిస్తుంది. ఈ సినిమాకి అంతటి చక్కటి బీజీఎమ్ అందించాడు జీవీ. దీంతో ఇకపై జీవి-అనిరుద్ మధ్య బిగ్ ఫోటో తప్పదనే అంశం చర్చకొస్తుంది. జీవి ఇమేజ్ ఇప్పుడు రెట్టింటపు అవుతుంది. తెలుగులోనూ అవకాశాలు అందుకుంటున్నాడు. ప్రస్తుతం జీవి కోలీవుడ్ లో చాలా సినిమాలతో బిజీగా ఉన్నాడు. నటుడిగా కొనసా గుతూనే సంగీత దర్శకుడిగా కెరీర్ ని ముందుకు తీసుకెళ్తున్నాడు.

## పండ్లు తినడం మంచిదా? జ్యూస్ తాగడం మంచిదా?



పండ్లు తినడం మంచి ఆరోగ్యకరమైన అలవాటుగా పరిగణించబడుతుంది. పండ్లలోని పోషకాలు, విటమిన్లు, ఫైబర్, మరియు యాంటీఆక్సిడెంట్లు శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. అయితే, పండ్లు తినడం మరియు వాటి జ్యూస్ తాగడం మధ్య కొన్ని తేడాలు ఉన్నాయి. రెండింటి వల్ల కలిగే ప్రయోజనాలు, లోపాలు గురించి తెలుసుకుంటే మిమ్మల్ని మీరు ఆరోగ్యకరమైన ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. పండ్లు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఫైబర్ అధికంగా ఉండటం: పండ్లలో సహజసిద్ధంగా ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది మరియు ప్రాసెస్‌ను సమతుల్యంగా ఉంచుతుంది. ఫైబర్ హృదయ ఆరోగ్యానికి మంచిది , కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. "సీతాఫలం ఆకులు కన్పిస్తే ఇంట్లో తెచ్చిపెట్టుకోండి.. ఎందుకంటే?" మధుమేహం ఉన్నవారికి మంచిది: పండ్లలోని చక్కెర సహజమైనది కాబట్టి, ఇది నెమ్మదిగా శరీరంలో శోషితమవుతుంది. దీని వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు హఠాత్తుగా పెరగకుండా నియంత్రించబడతాయి, ఇది మధుమేహం ఉన్నవారికి మంచి పరిష్కారం. యాంటీఆక్సిడెంట్లు అధికం: పండ్లలో విటమిన్ అ, విటమిన్ ం, ఇతర యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి, శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి. డీహైడ్రేషన్ నుంచి రక్షించడం: పండ్లు సహజంగా నీటిని కలిగి ఉంటాయి, శరీరాన్ని ఆహ్లాదంగా ఉంచడంలో సహాయపడతాయి. కొన్ని పండ్లలో 80-90% నీటి శాతం ఉండటం వల్ల దాహం తీర్చడంలో, డీహైడ్రేషన్ నుంచి రక్షించడంలో సహాయపడతాయి. "రోజూ ఈ ఒక్క పండు తింటే చాలు రక్తపోటు రమ్మన్నా రాదు!" జ్యూస్ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు శరీరానికి తక్షణ శక్తి : జ్యూస్ త్రాగడం ద్వారా శరీరానికి వెంటనే గ్లూకోజ్ అందుతుంది, ఇది తక్షణ శక్తిని అందించడానికి ఉపయోగపడుతుంది. క్రీడాకారులు లేదా శరీర శ్రమ చేసే వారికి ఇది ఒక శక్తి వనరుగా పనిచేస్తుంది. : కోర్టును ఆశ్రయించిన పిన్నెల్లి.. పాస్ పోర్ట్ కావాలి। బీ వెయిట్ మేనేజ్‌మెంట్: కొంతమంది మద్యం, మోటు పదార్థాలను తగ్గించడానికి జ్యూస్ తీసుకోవడం వల్ల శరీరానికి తేలిక ఉంటుంది. పండ్లు తినడానికి సమయం లేకపోతే, జ్యూస్ త్రాగడం వేగంగా శక్తి ఇవ్వవచ్చు. వివిధ పండ్ల మిశ్రమం: పండ్లను మిక్స్ చేసి జ్యూస్ రూపంలో త్రాగడం ద్వారా వేర్వేరు పండ్లలోని పోషకాలను ఒకేసారి తీసుకోవచ్చు. ఈ పండ్లు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి!!" తేడాలు - లోపాలు ఫైబర్ లోపం: పండ్లను తినేటప్పుడు అందే ఫైబర్, జ్యూస్ తీసుకోవడం ద్వారా అందదు. జ్యూస్ త్రాగేటప్పుడు ఫైబర్ తొలగిపోతుంది, ఇది జీర్ణ ప్రక్రియలో కొంత నెమ్మదింపుగా ఉంటుంది. చక్కెర అధిక శాతం: జ్యూస్ తీసుకోవడం వల్ల పండ్లలోని సహజ చక్కెర నేరుగా శరీరానికి అందుతుంది. ఇది శరీరంలో గ్లూకోజ్ స్థాయిలను త్వరగా పెంచుతుంది, ఇది మధుమేహం ఉన్నవారికి, లేదా అధిక బరువు ఉన్నవారికి నష్టం కలిగిస్తుంది. తక్కువ తృప్తి: పండ్లను తిన్నప్పుడు తృప్తి త్వరగా కలుగుతుంది, కానీ జ్యూస్ త్రాగినప్పుడు ఈ తృప్తి ఉండదు. దీనివల్ల ఎక్కువ మోతాదులో జ్యూస్ త్రాగి అదనపు క్యాలరీలు తీసుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ పదార్థాల మిశ్రమం: మార్కెట్లో లభించే పండ్ల రసాల్లో రసాయనాలు, కృత్రిమ చక్కెరలు కలపడం వల్ల అవి ఆరోగ్యానికి మంచి ఎంపిక కాకపోవచ్చు. ఇలాంటి వాటిలో ఆరోగ్యకరమైన పోషకాలు తగ్గిపోతాయి. పండ్లను సహజసిద్ధంగా తినడం చాలా మంచిది, ఎందుకంటే ఫైబర్ సహా ఇతర పోషకాలు పొందవచ్చు. జ్యూస్ త్రాగడం కూడా మంచిదే కానీ, అది ఎక్కువ చక్కెర తీసుకోకూడదని జాగ్రత్తగా చూసుకోవాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని కాపాడుకునేందుకు రోజుకు కొన్ని పండ్లను తినడం ఉత్తమ ఎంపిక.

### రాత్రిపూట జుట్టుకు ఆయిల్ రాస్తే మంచిదేనా?

రాత్రిపూట జుట్టుకు ఆయిల్ రాయడం అనేది చాలా మంది పాటించే సంప్రదాయం. దీని వల్ల జుట్టు ఆరోగ్యానికి కొంత మేలు జరుగుతుందని విశ్వసిస్తారు. అయితే, ఇది ప్రతి ఒక్కరికీ సరిపోదు, ఎందుకంటే జుట్టు రకం, ఆరోగ్య పరిస్థితి, తల చర్మం రకాన్ని బట్టి ఆయిల్ రాయడం మంచిదా లేదా అనేది మారుతుంటుంది. ఇది మంచి ఫలితాలను ఇవ్వాలంటే కొన్ని ముఖ్యమైన విషయాలను గమనించాలి. రాత్రిపూట ఆయిల్ రాయడం వల్ల కలిగే ప్రయోజనాలు: జుట్టుకు పోషణ: ఆయిల్‌లో ఉండే విటమిన్లు, మినరల్స్, ఫ్యాటీ యాసిడ్స్ జుట్టు వేర్లను బలపరుస్తాయి. తల చర్మంలో లోతుగా చేరి పోషణ ఇస్తుంది. ఉదాహరణకు, కొబ్బరి నూనె, ఆముదం నూనె వంటి వాటిలో విటమిన్ ఇ, లౌరిక్ యాసిడ్ వంటి పోషకాలు ఉండడం వల్ల జుట్టు కుదుళ్ళు బలపడతాయి. " బట్టతల ఎందుకు వస్తుందో తెలుసా..?" జుట్టు పెరుగుదల: తల చర్మానికి తగిన ఆయిల్ మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది, ఇది జుట్టు కుదుళ్ళను ఉత్తేజపరచి జుట్టు పెరుగుదలను సులభతరం చేస్తుంది. చుండ్రు సమస్యల నివారణ: నీలగిరి, టీ ట్రీ ఆయిల్‌లలో ఉండే యాంటీ ఫంగల్ గుణాలు చుండ్రు, తల చర్మ సమస్యలు తగ్గించడంలో సహాయపడతాయి. రాత్రంతా ఈ ఆయిల్ తల చర్మంలో ఉండడం వల్ల ఇవి మరింత ప్రభావవంతంగా పనిచేస్తాయి. జుట్టు తేమను నిలుపుకోవడం: రాత్రిపూట ఆయిల్ రాస్తే జుట్టులో తేమ నిలుపుకుంటుంది. పొడిగా ఉన్న చర్మం ఉన్నవారు ఈ పద్ధతిని పాటించడం వల్ల తల చర్మం పొడిబారకుండా ఉంటుంది. "జుట్టు రాలుతుందని చింతించవద్దు.. ఈ సింపుల్ ట్రిక్స్‌తో నివారించుకోండి." జుట్టుకు రాత్రిపూట ఆయిల్ రాయడం వల్ల కలిగే సమస్యలు: అతి తేలికపాటి తల చర్మం: కొంతమందికి చర్మం ఎక్కువ సెన్సిటివ్‌గా ఉండడం వల్ల రాత్రంతా ఆయిల్ పెట్టుకుని ఉండటం వల్ల పొల్లు, మొటిమలు వస్తాయి.

## ఆడిషన్ లో అది దొరకడమే గొప్ప!

నటీనటులను ఎవరైనా సరే ఓ సినిమాలోకి తీసుకోవాలంటే వారిని ఆడిషన్ చేయడం కామన్. డైరెక్టర్ రాసుకున్న పాత్రలో సదరు నటీనటులు ఎలా పెర్ఫార్మ్ చేస్తున్నారు? ఆ పాత్ర ఎవరికి అప్పచెప్తే బాగా చేయగలరు అనే విషయాలు ఆడిషన్ చేస్తేనే తెలుస్తోంది. హీరోలు, హీరోయిన్లు, కీలక నటీనటులకు కూడా చాలా సందర్భాల్లో ఆడిషన్ ఉంటుంది. ఎంతోమంది డైరెక్టర్లు ఇప్పటికీ ఆ విధానాన్నే ఫాలో అవుతూ ఉంటారు. స్టార్ హీరోలకు సైతం కొన్నిసార్లు ఆడిషన్స్ తప్పవు. ఆడిషన్ చేయడం వల్ల సదరు యాక్టర్ మీద ముందే డైరెక్టర్ కు ఓ క్లారిటీ వచ్చేస్తుంది. అయితే ఆడిషన్స్ ఇవ్వడమంటే మాటలు కాదు. అక్కడ ఎంతోమంది ఉంటారు. దానికి తోడు కొత్త వాళ్లైతే అక్కడ చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆడిషన్ కు వెళ్లిన కొత్తవారికి అక్కడ కనీస సౌకర్యాలు కూడా ఉండవు. కూర్చోడానికి ఏమీ ఉండదు, తాగడానికి నీళ్లుండవు, ఇలా చాలానే ఇబ్బందులుంటాయి. ఇదిలా ఉంటే సంగీత్ శోభన్ రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆడిషన్స్ లో ఉండే ఇబ్బందుల్ని చెప్పాడు. తాను మ్యాడ్ సినిమాలో నటించినప్పుడు బాగా చేశావన్నారని, కానీ మ్యాడ్ స్క్వేర్ సినిమా తర్వాత తనని సడెన్ గా నెపో కిడ్ అంటున్నారని చెప్పాడు. సడెన్ గా తాను నెపో కిడ్ ఎలా అయ్యానో అర్థం కావడం లేదని, నెపో కిడ్ అయినంత మాత్రాన తానేం ఈజీగా ఇండస్ట్రీలోకి రాలేదని, తాను కూడా అందరిలానే ఆడిషన్స్ ఇచ్చానని, కాకపోతే తన తండ్రి నిర్మాత అవడం వల్ల ఆయన పేరు చెప్తే కుర్చీ వేసి, వాటర్ ఇచ్చేవారని, ఆడిషన్ లో అది దొరకడమే చాలా అదృష్టమని.. ఆడిషన్స్ అలానే జరుగుతాయని సంగీత్ శోభన్ చెప్పుకొచ్చాడు. అలా అని ఎప్పుడూ తన తండ్రి పేరుని వాడుకోలేదని, తండ్రి పేరు వాడుకున్నా చివరికి టాలెంట్ ఉంటేనే కదా అనుకుని ఎప్పుడూ ఆయన పేరుని ఉపయోగించుకోలేదని చెప్పాడు సంగీత్. తన తండ్రి నుంచి సినిమా వచ్చింది ఎప్పుడో 2006లో. కానీ ఇప్పుడు తాను హీరో గా మారితే నెపోటిజం ఎలా అవుతుందో తనకు అర్థం కావడం లేదని, ఇండస్ట్రీలోకి వచ్చినప్పుడు తన అన్నయ్య సంతోష్ శోభన్ కూడా ఎన్నో ఇబ్బందులు పడ్డాడని, అన్నతో పోలిస్తే తన కష్టం కాస్త తక్కువేనని సంగీత్ తెలిపాడు.

### అందానికే మరో అందం....



## పూరి సర్.. ఇద్దరు హీరోయిన్స్ సెంటిమెంట్!



డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ లైగర్, డబుల్ ఇస్మార్ట్ సినిమాలతో డిజాస్టర్‌లను చవి చూశారు. ప్రస్తుతం పూరితో సినిమా అంటే స్టార్ హీరోలు అవసరమా అనుకుంటున్నారు. డబుల్ ఇస్మార్ట్ తర్వాత పలువురు హీరోలతో టచ్‌లోకి వెళ్లేందుకు పూరి ప్రయత్నించారని, కానీ చాలా మంది హీరోలు ఆయనకు మొహం చాటారు అని గుసగుసలు వినిపించాయి. ఎట్టకేలకు విజయ్ సేతుపతితో సినిమాను పూరి కన్ఫర్మ్ చేశాడు. విభిన్న చిత్రాలు చేస్తూ ఆకట్టుకుంటున్న విజయ్ సేతుపతి ఈ సినిమాను ఒప్పుకున్నాడంటే కచ్చితంగా కథలో విషయం ఉండే ఉంటుంది. పూరి జగన్నాథ్ మార్క్ మాస్ ఎలిమెంట్స్‌తో పాటు, విజయ్ సేతుపతి మార్క్ వైవిధ్యం ఉంటుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. పూరి జగన్నాథ్ చివరగా 'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో హిట్ దక్కించుకున్నారు. రామ్ హీరోగా నటించిన ఆ సినిమాలో నిధి అగర్వాల్, నభా నటేష్‌లు హీరోయిన్స్‌గా నటించారు. ఇద్దరు హీరోయిన్స్ నటించిన ఆ విజయాన్ని సొంతం చేసుకోవడంతో ప్రస్తుతం విజయ్ సేతుపతి సినిమాలో ఇద్దరు హీరోయిన్స్ నటిస్తున్న కారణంగా సెంటిమెంట్ వర్కౌట్ అవుతుందని పూరి అభిమానులు మాట్లాడుకుంటున్నారు. కథానుసారంగా ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్స్ నటించబోతున్నారట. ఇప్పటికే టబు ను ముఖ్య పాత్ర కోసం ఎంపిక చేశారు. విజయ్ సేతుపతికి జోడీగా టబు నటించబోతుందనే వార్తలు వచ్చాయి. కానీ తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం విజయ్ సేతుపతికి జోడీగా టబు కనిపించబోవడం లేదు. సినిమాలో ముఖ్య పాత్రను టబు పోషిస్తూ ఉండగా విజయ్ సేతుపతికి జోడీగా రాధిక ఆప్టే నటించబోతుంది. తెలుగులో రాధిక ఆప్టే పలు సినిమాల్లో నటించింది. ఈ మధ్య కాలంలో బాలీవుడ్ కే పరిమితం అయిన టబు సుదీర్ఘ కాలం తర్వాత తెలుగు సినిమాలో నటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజయ్ సేతుపతికి జోడీగా రాధిక ఆప్టే దాదాపుగా కన్ఫర్మ్ అయిందనే వార్తలు వస్తున్నాయి. పూరి జగన్నాథ్ సినిమా అంటే హీరోయిన్స్‌కి మినిమం ప్రాముఖ్యగా ఉంటుంది. కనుక ఈ సినిమాలో కచ్చితంగా ఆమె పాత్రకు మంచి ప్రాముఖ్యత ఉంటుందనే నమ్మకంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. రాధిక ఆప్టే ఈ మధ్య కాలంలో సినిమాల కంటే వివాదాలతో ఎక్కువ వార్తల్లో నిలిచింది. ఈ సినిమాతో మరోసారి సౌత్‌లో రాధిక బిజీ అయ్యేనా చూడాలి. పూరి జగన్నాథ్‌కు ఈ సినిమా విజయం అత్యంత కీలకం. పూర్వ వైభవం దక్కించుకోవాలని తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్న పూరి జగన్నాథ్‌కు ఈ సినిమా హిట్ అయ్యేనా చూడాలి. ఇద్దరు హీరోయిన్స్‌తో ఒక విభిన్నమైన కాన్సెప్ట్‌తో ఈ సినిమాను ఆయన రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. సినిమా గురించి ఇప్పటి వరకు ఎన్నో పుకార్లు షికార్లు చేశాయి, కొత్తగా పుకార్లు పుట్టుకు వస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. ఈ సినిమా విజయం సాధిస్తే టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోలు మరోసారి పూరి జగన్నాథ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. టబు, రాధిక తెలుగు సినిమా ఇండస్ట్రీలో రీ ఎంట్రీ ఇవ్వబోతున్న నేపథ్యంలో వారికి కూడా ఈ సినిమా విజయం కీలకం.

## నాకు ఎందుకు ఈ అవార్డ్.. ఇది అతనిది: ధోనీ

టీమిండియా మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ సారథి మహేంద్ర సింగ్ ధోనీ మరోసారి తన మంచి మనసును చాటుకున్నాడు. ప్రత్యర్థి ఆటగాళ్ల కష్టానికి క్రెడిట్ ఇవ్వడంలో ఎప్పుడూ ముందుండే ధోనీ.. తాజాగా ఆ విషయాన్ని రుజువు చేశాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్‌తో సోమవారం లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వరుసగా ఐదు పరాజయాల తర్వాత విజయాన్నందుకుంది.ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో ధోనీ(11 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 26 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెన్నైకి విజయాన్నందించాడు. ఓటమి తప్పదనుకున్న మ్యాచ్‌లో తనదైన హిట్టింగ్‌తో విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. దాంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అతనికి దక్కింది. అయితే ఈ అవార్డ్ తనకు ఎందుకు ఇస్తున్నారని, నూర్ అహ్మద్ అద్భుతంగా బౌలింగ్ చేశాడని, ఇది అతనికి దక్కాల్సిందని పోస్ట్ మ్యాచ్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో అభిప్రాయపడ్డాడు. హోస్ట్ మురళీ కార్తీక్.. 18వ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ గెలవడం ఎలా అనిపిస్తుందని ప్రశ్నించగా.. ధోనీ భిన్నంగా స్పందించాడు.ఖఃఖూ లబ ఊఄ: కొంపముంచిన ధోనీ.. గెలిచే మ్యాచ్‌లో ఓడిన చెన్నై సూపర్ కింగ్స్!"ఖఃఖూ లబ ఊఄ: కొంపముంచిన ధోనీ.. గెలిచే మ్యాచ్‌లో ఓడిన చెన్నై సూపర్ కింగ్స్!""నాకు ఎందుకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ ఇస్తున్నారా? అని ఆలోచిస్తున్నాను. ఈ అవార్డ్ కోసం ఇతర వ్యక్తులు ఉన్నారు. నా కంటే నూర్ అహ్మద్, రవీంద్ర జడేజా మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ఇద్దరూ మిడిల్ ఓవర్లలో అద్భుతంగా బౌలింగ్ చేశారు.'అని ధోనీ చెప్పుకొచ్చాడు.



ఈ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు వేసిన నూర్ అహ్మద్ ఒక్క వికెట్ తీయకపోయినా 13 పరుగులే ఇచ్చాడు. మరోవైపు జడేజా మూడు ఓవర్లలో 24 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 166 పరుగులు చేసింది. రిషభ్ పంత్(49 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. చెన్నై బౌలర్లలో రవీంద్ర జడేజా(2/24), మతీష పతీరణ(2/45) రెండేసి వికెట్లు తీయగా.. ఖలీల్ అహ్మద్, అన్షుల్ కంబోజ్ చెరో వికెట్ పడగొట్టారు.అనంతరం చెన్నై సూపర్ కింగ్స్ 19.3 ఓవర్లలో 5 వికెట్లకు 168 పరుగులు చేసి గెలుపొందింది. ధోనీ(11 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 26 నాటౌట్)తో పాటు శివమ్ దూబే(37 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 43 నాటౌట్), రచిన్ రవీంద్ర(22 బంతుల్లో 5 ఫోర్లతో 37), అరంగేట్ర ప్లేయర్ షేక్ రషీద్(19 బంతుల్లో 6 ఫోర్లతో 27) రాణించారు. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లలో రవి బిష్ణోయ్(2/18) రెండు వికెట్లు తీయగా.. దిగ్వేష్ రతి, ఆవేశ్ ఖాన్, ఎయిడెన్ మార్క్‌రమ్ తలో వికెట్ తీసారు. సీఎస్‌కే ఓటమి ఖాయమనుకున్న పరిస్థితుల్లో ధోనీ దూకుడుగా ఆడి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.